జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761


epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 27-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 684 పేజీలు: 4 వెల : రూ.7

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# ప్రభుత్వ భూమిలో.. ప్రైవేట్ లేఅవుట్..

## ఎఫెక్ట్




# తొలగింపు

- తహసిల్దార్ రమేష్ కుమార్ చర్యలపై సర్వత్రా హర్షం
- ఆ లేఅవుట్‌లో బోర్డు ఏర్పాటు
- ఎవరైనా కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చర్యలంటూ హెచ్చరిక
- 'జాతీయ వార్త' కథనానికి స్పందన

**సోంపేట, మే 26 (వార్త):** కంచిలి మండలం అంపురం గ్రామ రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి ప్రక్కన సర్వే నెంబర్ 116- 1బి లో గల వివాదాస్పద భూమిలో ఇటీవల కొంతమంది దౌర్జన్యంగా వేసిన లేఅవుట్‌పై తహసిల్దార్ రమేష్ కుమార్ మంగళవారం తనదైన రీతిలో చర్యలు చేపట్టారు. 'జాతీయ వార్త' దినపత్రికలో 'ప్రభుత్వ భూమిలో ప్రైవేటు లేఅవుట్' శీర్షికన సోమవారం ప్రచురించిన కథనానికి స్థానిక రెవెన్యూ వర్గాలు వెంటనే స్పందించాయి. ఆగమేఘాలపై తహసిల్దారు రమేష్ కుమార్ సిబ్బందితో కలసి సోమవారం వివాదాస్పద భూమిని పరిశీలించారు. లేఅవుట్ ఎవరు వేశారన్న దానిపై ఆరా తీశారు. కార్యాలయానికి వారిని పిలిపించి గట్టిగా హెచ్చరించారు. లోకాయుక్త తీర్పుతో ప్రస్తుతం సదరు భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందని దీనిపై రాష్ట్ర హైకోర్టులో ఇంకా వాజ్యం కొనసాగుతుందని ఈ భూమిపై ఎటువంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లేఔట్ కోసం పాటించిన రాళ్లను వెంటనే తొలగించాలని లేనియెడల రెవెన్యూ చట్టానికి పని చెప్పాల్సి ఉంటుందని గట్టిగా చెప్పడంతో మంగళవారం ఉదయం నుంచి సదరు భూమిలో పాతిన రాళ్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. అలాగే ఈ భూమిపై రాష్ట్ర హైకోర్టులో 27042/25 నంబర్ తో రిట్ పిటిషన్‌పై వాజ్యం కొనసాగుతున్నదని, ఆక్రమణదారులు శిక్షార్హులని తహసీల్దార్ బోర్డు ఏర్పాటు చేయించారు. రెవిన్యూ సిబ్బంది ఈ బోర్డును వివాదాస్పద భూమి వద్ద మంగళవారం ఏర్పాటు చేశారు. 'జాతీయ వార్త'లో వచ్చిన కథనం సర్వత్ర చర్చనీయాంశం అయింది. ఈ ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా కొంతమంది కూటమినేతల ప్రోద్బలంతో ఏకంగా ప్రభుత్వ భూమిలోనే ఇటువంటి చర్యలకు దిగడం పట్ల అన్ని వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ వివాదం తేలకుండానే ఇలా బరితెగించి ఏకంగా లేఅవుట్ వేయాలని దురాలోచనను సర్వత్ర ఖండిస్తున్నారు. కోర్టులను, చట్టాలను ఖాతరు చేయకుండా అధికారులనే కవ్వించేలా చర్యలకు దిగడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు.








# కూతురిపై తండ్రి అఘాయిత్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాలిక తల్లి
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

**శ్రీకాకుళం క్రైం, మే 26 (వార్త):** ఆమదాలవలస పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో కన్న కూతురిపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భారత సైన్యంలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి సెలవులపై ఇంటికి వచ్చే సమయంలో మద్యం మత్తులో తన మైనర్ కుమార్తెను భయపెట్టి పలుమార్లు అత్యాచారానికి పాల్పడేవాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై సనపల బాలరాజు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.



## మొబైల్ పోయిందా.. సీఈఐఆర్ పోర్టల్‌లో..

# ఫిర్యాదు చేయండి



- జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
- 518 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత
- ఒక కోటి విలువైన మొబైల్ ఫోన్ల రికవరీ

**శ్రీకాకుళం, మే 26 (వార్త):** ప్రజల మొబైల్ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఎవరైతే పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించే కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా పోలీసులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, ఐటీ సెల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి, గత నాలుగు నెలల వ్యవధిలో సుమారు రూ.1 కోటి విలువ గల 518 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో జిల్లా ఎస్పీ వివరాలు వెల్లడించి, స్వయంగా బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేశారు. జిల్లా ఎస్పీగా కె.వి. మహేశ్వర రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా పోలీసులు 2024 సంవత్సరంలో 622, 2025 సంవత్సరంలో 1060, 2026లో ఇప్పటి వరకూ 518 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. వీటి విలువ సుమారు 3.70 కోట్ల రూపాయలు ఉంటుంది. ఈ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో విశ్లేషించి,ఇతర రాష్ట్రాలు మరియు జిల్లాల్లో ఉన్న ఫోన్లను కూడా గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కూడా ఫోన్ బ్లాక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు పై వెబ్‌సైట్‌లో తమ మొబైల్ వివరాలతో బ్లాకింగ్ అభ్యర్థన నమోదు చేసుకోవడం ద్వారా దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నమోదు చేసిన ఫిర్యాదులు, పోలీస్ స్టేషన్లలో అందిన సమాచారాన్ని సమన్వయం చేసుకుంటూ జిల్లా సైబర్ క్రైమ్ మరియు ఐటీ సెల్ బృందం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఫోన్లను గుర్తిస్తోందన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారంతా ఆలస్యం చేయకుండా వెంటనే సదరు పోర్టల్‌లో బ్లాక్ (ఫిర్యాదు) చేయాలని కోరారు. లేదంటే అదే మొబైల్ తో సైబర్ నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. దూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న మొబైల్ ఫోన్లను కూడా గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో విశేష ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ మరియు ఐటీ సెల్ సీఐ ఇన్స్పెక్టర్, సైబర్ బృందం సభ్యులు, శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్ల అధికారులు, సీసీఎస్ సిబ్బంది, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు సత్వర సేవలు అందించడంలో వారి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి లభించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, అతి తక్కువ సమయంలో ఫోన్లను రికవరీ చేసి అందించిన జిల్లా ఎస్పీకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, సీసీఎస్ ఇన్స్పెక్టర్ సూర్య చంద్ర మౌళి,పోలీసు అధికారులు, సైబర్ క్రైమ్, ఐటీ సెల్ సిబ్బంది, బాధితులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మండల టాపర్లకు విద్యా పురస్కారాలు

**మెళియాపుట్టి, మే 26(వార్త):** పదో తరగతి పరీక్షల ఫలితాలలో మెళియాపుట్టి మండలంలో అత్యధిక మార్కులు సాధించిన 586 మార్కులు సాధించిన కలవల గోపీచంద్, 585 మార్కులు సాధించిన జనని రెడ్డి టాపర్లకు ట్రస్ట్ ద్వారా విద్యా పురస్కారాలను ప్రధానం చేసే కార్యక్రమాన్ని మంగళవారం నాడు మెళియాపుట్టి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ కొసమల పాఠశాల విద్యార్థి కలవల గోపీచంద్ 586 సాధించి ప్రథమ స్థానంలో నిలువుగా జడ్పీహెచ్ఎస్ చాపర విద్యార్థి జననీ రెడ్డి 585 మార్కులతో ద్వితీయ స్థానంలో ఉన్న వీరికి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి వివిధ స్థాయిలో ఉన్న వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, మండల విద్యాశాఖధికారులు ఎస్. దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభం, పి. రామరాజు, జడ్పీహెచ్ఎస్ చాపర ప్రధానోపాధ్యాయులు సలాన వ్యాసగీత, జడ్పీహెచ్ఎస్ కొసమల ప్రధానోపాధ్యాయులు నిమితకుమారి సాహూ, ఏపీఓ రవి, బోచు ప్రసాద్, ఉపాధ్యాయులు రవి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ గ్రామాల నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**మెళియాపుట్టి, మే 26(వార్త):** స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మెళియాపుట్టి మండలంలో పంచాయతీలకు చెత్త సేకరణకు సంబంధించి ట్రై సైకిళ్లను మంగళవారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే గోవిందరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ్ ఆంధ్ర గ్రామలుగా తీర్చిదిద్దే దిశగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల పరిశుభ్రత పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు ఏర్పాట్లపై కొల్ల సమీక్ష



**పలాస, మే 26(వార్త):** పలాస మహానాడు పై సమీక్ష సమావేశం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొల్ల అప్పలనాయుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. పలాస నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నుంచి జరుగబోవు మహానాడు-2026 ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పలాసలో పార్టీ కార్యాలయంలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌తో పాటు ఎస్ఎంసి ఫంక్షన్ హాల్-1, 2 ప్రాంతాలను సందర్శించి, కార్యక్రమ నిర్వహణలో భాగంగా క్లస్టర్ కమిటీలకు పలు కీలక సూచనలు చేశారు. మహానాడు విజయవంతం కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, పార్టీ శ్రేణుల సమన్వయం, కార్యకర్తల సౌకర్యాలు, అతిథుల నిర్వహణ తదితర అంశాలపై నాయకులతో సమగ్రంగా చర్చించి కార్యాచరణ దిశానిర్దేశం చేశారు. పార్టీ ప్రతిష్టకు తగ్గట్టుగా ప్రతి ఏర్పాటూ అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు పీరుకట్ల విఠల్,సంతకవిటి మండల పిఏసిఎస్ అధ్యక్షులు చెలికాని మహేష్, పలాస టౌన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జానకమ్మ కుటుంబానికి సాయిరాజ్ పరామర్శ



**ఇచ్ఛాపురం, మే 26(వార్త):** బాలకృష్ణాపురం పంచాయతీ వైస్సార్సీపీ కార్యకర్త వాగడ ఢిల్లీ తల్లి వగాడ జానకమ్మ (70) ఇటీవలే అనారోగ్య కారణంతో మృతిచెందారు. వారి కుటుంబానికి ఇచ్ఛాపురం మాజీ శాసనసభ్యులు, వైస్సార్సీపీ సీఈసీ మెంబర్ పిరియా సాయిరాజ్ వారి కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, మాజీ ఎంపీపీ బెందాళం జయప్రకాష్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు,జిల్లా ఉపాధ్యక్షులు రాంపత్ని చిట్టిబాబు, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాళ్ళ మనోజ్, మాజీ మండల అధ్యక్షులు పిట్ట ఆనంద్, పాతిర్ల రాజశేఖర్, పిట్ట మామయ్య, మాజీ కౌన్సిలర్లు జగన్, తేజేశ్వరరావు, మాజీ సర్పంచులు ఇసురు తులసిరామ్, నీలాపు సారధి, దుక్క ధనలక్మి, బుడ్డ కళ్యాణ్, కాళ్ళ దేవరాజు, బదకల మోహన్ దాస్, పిట్ట బాలయ్య, కారింగి త్రినాథ్, గుజ్జు ఢిల్లీరావు, వాణిజ్య విభాగం అధ్యక్షులు తిప్పన నాగరాజు, సాడి గురుమూర్తి పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బీ బంగ్లా రహదారి ఆక్రమణల తొలగింపు



**పలాస, మే 26 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పాత జాతీయ రహదారి ఆనుకొని ఉన్న మేదర వీధి బంగ్లా రహదారి ఆక్రమణలను మంగళవారం పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది తొలగించారు. బంగాళా రహదారి వెళ్లే వాహనాలు ఏర్పడుతున్నంతో ఆక్రమ తొలగింపుకు ఎట్టకేలకు మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు గల బంగ్లా రహదారి కుచించుకుపోవడంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. మేదర వీధి నివాసులు వారి ఇంటి ముందు గల ఖాళీ స్థలాలను దశాబ్ద కాలంగా ఆక్రమించుకొని చిన్నచిన్న గుడిసెలు వేసుకుని వెదురుతో అల్లుకుని జీవనం సాగించేవారు. ఈ ఆక్రమంలో తొలగించడంతో వాళ్ల జీవన భృతికి తీవ్ర అంతరాయం ఏర్పడిందని పలువురు మేదరి వీధి ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పట్టణాభివృద్ధి దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవలసిన అవసరం ఉన్నప్పటికీ తొలగింపు చర్యలు జాప్యం జరిగిందని పట్టణ వాసులు వాపోతున్నారు.

## పారాక్వాట్ గడ్డిమందు అమ్మకాలు, నిల్వలపై నిషేధం



**నరసన్నపేట, మే 26 (వార్త):** వరి, మొక్కజొన్న తదితర పంటలలో కలుపు నివారణకు వినియోగించే పారాక్వాట్ డీక్లోరైడ్ 24 శాతం ఎస్ఎల్ గడ్డిమందు ఉత్పత్తి అమ్మకాలు, నిల్వలు, పంపిణీపై ప్రభుత్వం నిషేధం విధించిన నేపథ్యంలో సంబంధిత నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని వ్యవసాయాధికారి (ఏవో) సూర్యకుమారి సూచించారు. మంగళవారం నరసన్నపేట మండల పరిధిలోని ఏడు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గడ్డిమందుల నిల్వలు, విక్రయ రికార్డులు, లైసెన్సులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. సోదాల్లో భాగంగా నిషేధిత పారాక్వాట్ డీక్లోరైడ్ 24 శాతం ఎస్ఎల్ గడ్డిమందుకు సంబంధించిన సుమారు 1,200 లీటర్ల నిల్వలను గుర్తించి వాటి అమ్మకాలను తక్షణమే నిలిపివేస్తూ సంబంధిత వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం విధించిన నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, నిల్వలో ఉన్న ఉత్పత్తులను విక్రయించరాదని స్పష్టం చేశారు. వ్యవసాయ ఇన్‌పుట్ దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, నిషేధిత ఉత్పత్తుల విక్రయాలు, పంపిణీ లేదా నిల్వలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా నిషేధిత గడ్డిమందులను కొనుగోలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ రంగంలో నాణ్యమైన ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు రైతుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ తనిఖీలు కొనసాగుతాయని ఏవో సూర్యకుమారి తెలిపారు. అధికారులు చేపడుతున్న తనిఖీలకు సహకరించాలని వ్యాపారులు, రైతులను కోరారు.

# జగన్ పాలనలోనే ప్రజా సంక్షేమం

- విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి ఆదర్శంగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రెండేళ్ల కూటమి పాలనలో సామాన్యులపై వేధింపులు, ఇబ్బందులే
- అసమర్థతను దాచుకునేందుకే చంద్రబాబు మళ్లీ 'ఫ్యాక్షనిజం' డ్రామాలు
-రైతాంగాన్ని రోడ్డున పడేసి.. ప్రశ్నించిన వారిపై అక్రమ అరెస్టుల పర్వం
-మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



**శ్రీకాకుళం, మే 26 (వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక అద్భుతమైన విజనరీ ఉన్న గొప్ప నాయకుడని, ఆయన హయాంలోనే రాష్ట్రంలో నిజమైన ప్రజా సంక్షేమ పాలన సాగిందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కొనియాడారు. మంగళవారం శ్రీకాకుళంలోని జాబిలి కళ్యాణమండపంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన తనదైన శైలిలో కడిగి పారేశారు. ఈ ప్రెస్ మీట్‌లో రాష్ట్ర కళింగ వైశ్య బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అందవరపు సూరిబాబు, తూర్పు కాపు బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్, రాష్ట్ర కళింగ వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పట్నాన శ్రీనివాసరావు, ఎంపీటీసీ అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని ధర్మాన మాట్లాడిన అంశాలకు మద్దతు పలికారు.

### జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యా, వైద్య రంగాలకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ధర్మాన గుర్తుచేశారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేస్తూ, ప్రజల ముంగిటకే అవినీతి రహిత పరిపాలనను చేర్చాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. నాడు సమాజంలో ప్రతి పేదవాడు, ప్రతీ ఇల్లూ ఆనందంగా ఉండాలనే ఏకైక లక్ష్యంతో సంక్షేమ పథకాలను అమలు చేసి చూపించిన ఘనత జగన్‌కే దక్కుతుందని కొనియాడారు.

### ప్రజలను వేధించడమే కూటమి ధ్యేయం

ప్రస్తుత చంద్రబాబు నాయుడి ప్రభుత్వ పనితీరుపై ధర్మాన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో ప్రజలను ఏ విధంగా ఇబ్బంది పెట్టాలో, ఏ రకంగా వేధించాలో అదే పద్ధతిలో కూటమి ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. ప్రజలకు సంపద సృష్టిస్తామని, సూపర్ సిక్స్ అమలు చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. నేడు పేదలకు అండగా ఉన్న ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు మంగళం పాడుతూ ప్రజల జీవిత ప్రమాణాలను దిగజారుస్తున్నారని ఆరోపించారు.

### ఫ్యాక్షనిజం ముగిసిన అధ్యాయం

ఇరవై ఏళ్ల క్రితమే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమలో కత్తులు, గొడ్డళ్లు, బాంబుల సంస్కృతిని భూస్థాపితం చేసి ఫ్యాక్షనిజానికి శాశ్వత ముగింపు పలికారన్నారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తన పరిపాలనా అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి మళ్లీ ఫ్యాక్షనిజం అనే పాత పల్లవిని అందుకుని డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. ఎక్కడో లేని ఫ్యాక్షనిజాన్ని చంద్రబాబు మళ్లీ ప్రజలకు గుర్తు చేస్తూ సమాజంలో భయభ్రాంతులు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### దారుణ స్థితిలో రైతాంగం.. పట్టించుకోని బాబు

రాష్ట్రంలో అన్నదాతల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని ధర్మాన ఆవేదన చెందారు. జొన్న రైతులు తమ పంటను అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు వెళ్తే కొనలేమని నిర్మొహమాటంగా చెప్తున్నారని, చివరకు యూరియా కూడా దొరకక రైతులు బ్లాక్ మార్కెట్‌లో కొనుక్కునే దౌర్భాగ్య స్థితి నెలకొందని విమర్శించారు. గతంలో కరోనా వంటి విపత్కర సమయంలో గనుక ఈ కూటమి ప్రభుత్వం ఉండి ఉంటే సగం రాష్ట్రం ఖాళీ అయిపోయేదని ఎద్దేవా చేశారు.

### ప్రశ్నిస్తే కేసులు.. ఉద్యమాలకు సిద్ధం!

రాష్ట్రంలో కూటమి ఎమ్మెల్యేలు ఏది దొరికితే అది దోచుకుంటూ, అమ్ముకుంటున్నారని, చివరకు పోలీసులను కూడా క్రైమ్స్ చేయడానికి వాడుకుంటున్నారని ధర్మాన ఆరోపించారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడితే అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ హక్కులైన పీఆర్‌సీ కమిటీ గురించి ప్రశ్నిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు.. విమర్శించిన వారినల్లా అరెస్టు చేసుకుంటూ పోతే అది త్వరలోనే పెద్ద ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని, ఎన్ని కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీ ప్రజా పక్షాన నిలబడి ప్రశ్నిస్తూనే ఉంటుందని ధర్మాన స్పష్టం చేశారు.

## క్రీడలు, యోగాతో ఆరోగ్యానికి మేలు

**మందస, మే 26(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లాలోని స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి పర్యవేక్షణలో వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా కిశోరి వికాసం-2026 కార్యక్రమం కొనసాగుతోంది. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పి.అరుణ ఆధ్వర్యంలో మందస మండలంలోని నారాయణపురం పంచాయతీ పెద్దకేసుపురం గ్రామంలో మంగళవారం 8వ సెషన్ గా శారీరక వ్యాయామం, ప్రాముఖ్యత, క్రీడలు ఆటలు, యోగ అనే అంశాలపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. జిల్లా బాలల రక్షణ విభాగం నుండి సింగూరు శ్రీనివాసరావు , బాలల హక్కులు, బాల్య వివాహ నిషేధ చట్టం-2006, బాలల లైంగిక నేరాల నిషేధ చట్టం-2012, విద్య హక్కు చట్టం-2009, గృహహింస నిరోధక చట్టం, బాలల న్యాయ(ఆదరణ, రక్షణ) చట్టం, మోటార్ వెహికల్ తదితర చట్టాలపై 11నుండి 18సంవత్సరాల బాలబాలికలకు వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజేశ్వరి, లక్ష్మి బాలలతో మాట్లాడుతూ బాలలు నేటి సమాజంలో తీసుకోవలసిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలు, ఆర్థిక అవగాహన, విద్యా హక్కు చట్టం అమలు



చేయుటకు తీసుకోవలసిన చర్యలు గురించి వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్ వైజర్ సురపరపు వైకుంఠరావు మాట్లాడుతూ బాలల హక్కులు గురించి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విలువలతో కూడిన విద్య ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్స్ పి.నాణెమ్మ, పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

## యువకుడిపై దాడి.. పలాసలో స్వల్ప ఉద్రిక్తత




**పలాస, మే 26 (వార్త):** పలాస సమీప రాజమ్మ కాలనీలో స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల కథనం మేరకు చేపల బాక్స్ దించేందుకు కారుతో వెళ్లిన యువకుడితో బైక్‌పై వచ్చిన మరో వర్గం హారన్ మోగిస్తూ కారు తీయాలని గొడవకు దారి తీశారు. మాటామాటా పెరగడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తమైంది. అనంతరం అక్కడికి చేరుకున్న ప్రత్యర్థి వర్గం వ్యక్తులు పురుషోత్తపురానికి చెందిన లండవాసుపై మూకుమ్మడిగా దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. మరోవైపు డొక్కరి దేవరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన కాశీబుగ్గ పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

- ట్రాక్టర్‌పై నుంచి జారిపడి..
ట్రక్ ఢీకొని విషాదం
-రిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూత

**జలుమూరు, మే 26 (వార్త):** జలుమూరు మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన రైతు చల్ల బాలరాజు (56) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం బాలరాజు తాను పండించిన నువ్వుల పంటను ట్రాక్టర్‌పై తీసుకుని వెళుతుండగా వాహనం అదుపుతప్పింది. ఈ క్రమంలో ఆయన ట్రాక్టర్‌పై నుంచి కిందకు జారిపడ్డాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ట్రక్ టైర్లు ఆయనపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన బాలరాజును చికిత్స నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారగా, గ్రామస్తులు సంతాపం వ్యక్తం



చేశారు. రైతు అకాల మరణం పట్ల గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## దాత మళ్లీ కదిలాడు

- గ్రౌండ్ అభివృద్ధికి రూ.25 వేల తొలివిడత సాయం అందించిన సామాజికవేత్త తాతారావు
-కిడ్నీ నివారణకు ఆర్.ఓ. ప్లాంట్, ప్లాంట్ మరమ్మతులకు సాయం
- తాజాగా ఆటస్థలానికి చేయూత
-సొంత గ్రామంపై తీరని మమకారం

**పలాస, మే 26 (వార్త):** "పుట్టిన ఊరి రుణం తీర్చుకోవడం కంటే గొప్ప భాగ్యం ఏముంది?" అన్న మాటను నిజం చేస్తున్నారు. పలాస నియోజకవర్గానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త జుత్తు తాతారావు. ప్రవాసంలో స్థిరపడినా, మనసంతా సొంత గడ్డపైనే లగ్నం చేసిన ఆయన, మరోసారి తన దాన గుణాన్ని చాటుకున్నారు. కాశీబుగ్గలోని శ్రీ చైతన్య హైస్కూల్ ఎదురుగా గల తన మేనల్లుడు రెయ్యి నాగు నిర్వహిస్తున్న "శ్రీ వారాహి ఎంటర్‌ప్రైజెస్, సోలార్ సొల్యూషన్స్" కార్యాలయంలో మంగళవారం గ్రామ పెద్దలు తాతారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన గతసారి గ్రామానికి విచ్చేసినప్పుడు ఆటస్థలం అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రకటించిన రూ.50 వేల ఆర్థిక సహాయంలో తొలి విడతగా రూ.25 వేల రూపాయలను నగదు రూపంలో గ్రామ కమిటీ సభ్యులకు అందజేశారు.



### మానవీయ కోణం: కిడ్నీ నుంచి క్రీడా మైదానం దాకా సేవా బాట

తాతారావు సేవ కేవలం నేటి సాయానికే పరిమితం కాదు. శ్రీకాకుళం జిల్లాలో కిడ్నీ వ్యాధుల తీవ్రతను గుర్తించిన ఆయన, గ్రామస్తులు కిడ్నీ వ్యాధులకు గురికాకుండా త్రాగునీటి శుద్ధ జలం కోసం ఏళ్ల క్రితమే సొంత ఖర్చుతో గ్రామంలో ఆర్.ఓ. ప్లాంటును నిర్మింపజేశారు. "మా ఊరి బిడ్డలు స్వచ్ఛమైన నీరు తాగాలి" అన్నదే ఆయన సంకల్పం. ఇటీవల ఆ ప్లాంట్ మరమ్మతులకు వచ్చినప్పుడు కూడా ఎవరినీ అడగకుండానే తానే స్వయంగా ఖర్చు భరించి మరమ్మతులు చేయించారు. అంతేకాకుండా, సందర్భానుసారంగా అనేకసార్లు గ్రామ అవసరాలకు ఆర్థిక సహాయం అందిస్తూ తన జన్మభూమి పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఇప్పుడు ఆయన దృష్టి గ్రామ యువత ఆరోగ్యంపై పడింది. "ఆటస్థలం ఉంటేనే పిల్లలకు శరీర దారుఢ్యం" అని భావించి, గ్రౌండ్ అభివృద్ధికి నడుం బిగించారు. జుత్తు దాన గుణం:

### మాట తప్పని మనసున్న మనిషి

తాతారావు దాతృత్వానికి ప్రత్యేక సందర్భం అక్కర్లేదు. ఇచ్చిన మాట ప్రకారం నడుచుకునే వ్యక్తిత్వం ఆయనది. గ్రామంలో పండుగ అయినా, ఆపద అయినా, అవసరం అయినా ముందుగా స్పందించే మనస్తత్వం ఆయన సొంతం. దూరంగా ఉన్నా, ప్రతి క్షణం గ్రామ క్షేమం కోసం ఆరాటపడతారు. గ్రామ పెద్దలు భావోద్వేగంతో మాట్లాడుతూ, "తాతారావు డబ్బు ఇవ్వడం లేదు, మా మీద ప్రేమను పంచుతున్నారు. ఆర్.ఓ. ప్లాంట్ నుంచి నేటి గ్రౌండ్ వరకు ఆయన చూపిస్తున్న దాతృత్వాన్ని, మానవత్వాన్ని మా గ్రామం ఏడు తరాలు గుర్తుంచుకుంటుంది. ఆయనకు, వారి కుటుంబ సభ్యులకు గ్రామ ప్రజల తరఫున, సంఘ కార్యవర్గం తరఫున శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నాం" అని అన్నారు. పలాస గడ్డ నుంచి వచ్చిన ఈ దాత, నేటి తరానికి సేవా మార్గాన్ని చూపిస్తున్న స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారు.

## వైభవంగా మహానాడు నిర్వహించాలి

-ఎమ్మెల్యే గౌతు శిరీష




**పలాస, మే 26 (వార్త):** తెలుగుదేశం పిలుస్తోంది... రా కదలిరా! అత్యంత వైభవంగా మహానాడు నిర్వహించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. ఆ పార్టీ పెద్ద పండుగ "మహానాడు" మొట్టమొదటిసారిగా క్లస్టర్ల వారీగా జరుగుతోంది. పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ప్రత్యేక పర్యవేక్షణలో, మన పలాస మండల మహానాడు వేడుకలు బుధవార అత్యంత ఘనంగా నిర్వహించబడుతున్నాయి.

**కార్యక్రమ వివరాలు:**

తేదీ 27.05.2026, 28.05.2026

సమయం: ఉదయం 9:00 గంటల నుంసాయంత్రం 5:00 గంటల వరకు (వర్చువల్ విధానంలో) నిర్వహిస్తున్నామని తెలిపారు.

**వేదిక:**

ఎస్ ఎం సి ఫంక్షన్ హాల్, ఐసీఐసీఐ బ్యాంక్ బ్యాక్ సైడ్ , కాశీబుగ్గ, పలాసలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపు మేరకు, మహానాడుకు తరలివచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ తప్పనిసరిగా పసుపు చొక్కాలు ధరించాలి, పార్టీ సభ్యత్వ కార్డు, మెడలో వేసుకోవాలని తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అన్నపూర్ణమ్మతల్లి వార్షికోత్సవం

**మందస, మే 26(వార్త):** మందసలోని శ్రీఅన్నపూర్ణమ్మ గ్రామదేవత 16వార్షికోత్సవం వైభవంగా జరిగింది. రాజులు, జమీందారుల కాలం నుంచి ఆనవాయితీ వస్తున్న పద్ధతిగానే అమ్మవారికి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుతో భక్తులు శ్రీఅన్నపూర్ణమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, గ్రామ ఉత్సవ కార్యక్రమాలు భక్తి, శ్రద్ధలతో జరిగాయి. మంగళవారం ఉదయం భవానీస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందస పట్టణంలోని దేవాంగులవీధి నుండి మార్కెట్ రోడ్డు మీదుగా గ్రామ దేవత గుడి వరకు ముగ్రాటలతో ఊరేగింపు చేశారు. ఊరేగింపులో మహిళలు బోనాలు, హారతులతో తమ భక్తిని చాటుకున్నారు. గ్రామ ప్రజలు మొక్కులు తీర్చుకుని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని, పంటలు బాగా పండాలని భక్తులు కోరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తజనాలతో సందడిగా మారింది.



# అభివృద్ధి పేరుతో ఉద్దానంలో కార్పొరేట్ కుట్ర

**-రైతు భూములే బలి కావాలా?**

**- ఉద్దానం రైతు కన్నీరు పట్టదా..**

**- 'ఉద్దానం రైతుల పొట్ట కొడితే పాలకులకు ఉసురు**

**- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ధ్వజం**

**మందస, మే 26(వార్త):** అభివృద్ధి పేరుతో ఉద్దానంలో కార్పొరేట్ కుట్ర జరుగుతోందని వైసీపీ నాయకులు బత్తిని లక్ష్మణ్, దున్న హరికృష్ణ, బెలమర జీవన్ ధ్వజమెత్తారు. మందస మండలంలోని హరిపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ పచ్చని ఉద్దా నాన్ని అధ్వాన్నం చేయడానికే పాలకులు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు.

**రైతుల భూములే బలి కావాలా?**

ఉద్దానం రైతు కన్నీరు మీకు పట్టదా అని ప్రశ్నించారు. తరతరాలుగా ఉద్యాన పంటలపై అధారపడి బతుతకున్న ఉద్దానం రైతుల పొట్ట కొడితే మీకు ఉసురు తగులుతుందన్నారు. భూమి పోతే బతుకే లేదని, రైతును బతకనివ్వండని కోరారు. రైతుల భూములు దోచుకోవడానికి వేసిన పక్కా స్కెచ్ ఇది అంటూ మండిపడ్డారు. వ్యవసాయశాఖామంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడుకు సూటిగా ఉద్దానం రైతుల సమస్యలపై సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు.

**ఉద్దానం ప్రాంత రైతాంగం సమస్యలు మీకు తెలియవా?**

తరతరాలుగా కొబ్బరి, జీడి తోటలపైనే ఆధారపడి బతుకుతున్నామని, ఒక్క ఎకరం కొబ్బరి తోటను నమ్ముకుని పదిమంది కడుపు నింపుకుంటున్నారన్నారని, అలాంటి భూమిని లాక్కుంటే మా బతుకులు వీధిన పడవా?" అని ప్రశ్నించారు. ఉద్దానంలో ఒక కొబ్బరి చెట్టు ఫల సాయం ఇవ్వాలంటే కనీసం ఏడేళ్లు పడుతుందని, జీడి చెట్టు కాపునకు రావాలంటే 5ఏళ్ల కష్టం ఉందన్నారు. తాతల కాలం నుంచి పెంచి పోషించిన తోటలు ఇవి. ఇవాళ మీరు భూములు లాక్కుంటే, రేపు ఆ రైతు ఏం తినాలి? పిల్లల్ని ఎలా చదివించాలి? కూలీ పనులకు వెళ్లాలా? ఇదేనా మీరు చెప్పే అభివృద్ధి? అన్నారు. ఒకసారి భూమి చేజారితే ఆ కుటుంబం మళ్లీ కోలుకోలేదని, కొబ్బరి, జీడి రైతు భూమి కోల్పోతే ఆ రైతు బతుకంతా బుగ్గి పాలు అవుతుందని, ఇచ్చే పరిహారం నాలుగు రోజులకు సరిపోతుందన్నారు. కానీ భూమి తరతరాలకు అన్నం పెడుతుందని, రైతును బతకనివ్వండి అని అన్నారు.

**కిడ్నీ మహమ్మారి కోరల్లో ఉద్దానం**

ఒక పక్క కిడ్నీ వ్యాధి మహమ్మారితో ఉద్దాన ప్రాంత ప్రజలు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావని, రోజురోజుకు ఈ వ్యాధి ఉధృతం అవుతోందన్నారు. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో కిడ్నీ బాధితులు ఉన్నారని, ఆ కుటుంబాల్లో ఒక్కరు డయాలసిస్‌కు వెళ్తే, మిగతా వాళ్లంతా కూలీ పనులు మానేసి వారి సేవల్లో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయా కిడ్నీ వ్యాధిగ్రస్తుల కుటుంబాల జీవన ప్రమాణాలు పూర్తిగా దిగజారిపోతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న రైతు భూమి కూడా లాక్కుంటే వాడు ఎక్కడికి పోవాలి? రైతు బతుకుతాడా చస్తాడా? అన్నారు.

**జిల్లాలో 12 వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు**

జిల్లాలో 12 వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయని, వజ్రపుకొత్తూరు మండలంలోని సీతానగరంలో 1875ఎకరాలు, పలాస వద్ద 800ఎకరాలు, భావనపాడులో 5000ఎకరాలు, మూలపేట వద్ద 1500ఎకరాల ప్రభుత్వ భూములు



ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని వదిలేసి, సారవంతమైన రైతు భూములపైనే కన్ను పడటం వెనుక కార్పొరేట్ కుట్ర దాగుందని ఆరోపించారు. అంతేకాదు, కాకరాపల్లి పవర్ ప్లాంట్ కోసం ప్రజల నుంచి కొనుగోలు చేసి ప్రస్తుతం ఈస్ట్ కోస్ట్ కంపెనీ వద్ద నిరుపయోగంగా ఉన్న సుమారు 2000ఎకరాలు, సోంపేటలో 12 ఏళ్ల క్రితం నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ (ఎన్సీసీ) పేరుతో కొని.. ఇప్పటికీ వాడకుండా పడేసిన 1000ఎకరాల భూమి కూడా ఉందన్నారు. ఇలా వేల ఎకరాలు నిరుపయోగంగా ఉంటే, మళ్లీ కొత్తగా రైతుల భూములు ఎందుకు లాక్కోవాలి? ఇది అదానీ, అంబానీలకు కట్టబెట్టడానికే వేస్తున్న ఎత్తుగడ కాదా? ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్ట్ కావాలి.. పరిశ్రమలు రావాలి.. కానీ అది రైతు గుండె కోసి కాదని, ఇప్పటికే సేకరించి వినియోగించకుండా ఉన్న కాకరాపల్లి, సోంపేట భూముల్లో, ప్రభుత్వ భూముల్లోనే అభివృద్ధి చేయండని కోరారు. రైతుల జోలికి రావద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్దానం రైతాంగం ఉద్యమ బాట పడుతుందని స్పష్టం చేశారు.

# అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**-జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డీసీసీ నాయకులు**


**- సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ హామీ**

**శ్రీకాకుళం, మే 26 (వార్త):** జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ల్ల ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఫిర్యాదులు ప్రజల నుంచి వస్తున్నాయని తెలిపారు. అక్రమంగా ఖనిజ సంపద తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర హాని కలుగుతోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జాయింట్ కలెక్టర్ సమస్యపై సమగ్రంగా పరిశీలిస్తామని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులతో నివేదికలు తెప్పించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కార దిశగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో సహజ వనరుల



పరిరక్షణ కోసం అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు అంబటి కృష్ణ, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలింతలు, గర్భిణుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



**నరసన్నపేట, మే 26 (వార్త):** బాలింతలు, గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్యాధికారులు విజయకుమార్, ప్రత్యూష సూచించారు. మంగళవారం నరసన్నపేట మండలం మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లతో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ద్వారా తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. వారికి అందుతున్న వైద్య సేవలు, పోషకాహార సహాయం, రక్తపరీక్షలు, ఇతర ఆరోగ్య పరీక్షల వివరాలను నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని సూచించారు. గర్భధారణ ప్రారంభం నుంచి ప్రసవం అనంతరం వరకు నిర్వహించే ప్రతి వైద్య పరీక్ష, ఆరోగ్య తనిఖీ వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ ఆరోగ్య సేవల అమలు సులభతరం అవుతుందని పేర్కొన్నారు. అలాగే అధిక ప్రమాద గర్భిణీలను ప్రత్యేకంగా గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలు, బాలింతలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్య కేంద్రాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా ప్రోత్సహించాలని ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

**నరసన్నపేట, మే 26 (వార్త):** వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు అప్పగించిన హోంవర్క్‌లను పరిశీలిస్తూ వారి విద్యా పురోగతిని పర్యవేక్షిస్తున్నామని ఉపాధ్యాయురాలు కొండాల జ్యోతి తెలిపారు. మంగళవారం నరసన్నపేట మండలం గొట్టిపల్లి పంచాయతీ పరిధిలోని రెడ్డికిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హోంవర్క్ పుస్తకాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవి సెలవులను కేవలం ఆటపాటలకే పరిమితం చేయకుండా చదువుకు కూడా సమయం కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల నుంచి ఇచ్చిన హోంవర్క్‌లను క్రమం తప్పకుండా పూర్తి చేయడం ద్వారా విద్యా నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 10 గంటల తర్వాత అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ పరిశుభ్రమైన మంచినీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు వివరించారు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషకాహారం అందించడంతో పాటు వేసవి కాలానికి అనుగుణమైన జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యతో పాటు ఆరోగ్యంపైనా దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**- పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన టాప్-12 విద్యార్థులకు సత్కారం**

**- కృషి, క్రమశిక్షణతో మరిన్ని విజయాలు సాధించాలి : ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**పోలాకి, మే 26(వార్త):** పట్టుదల, కృషి, క్రమశిక్షణతో చదువుకుంటే విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సత్కార కార్యక్రమంలో పదో తరగతి పరీక్షల్లో నియోజకవర్గ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల టాప్--12 విద్యార్థులను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విద్యార్థులకు శాలువాలు కప్పి,



జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కష్టపడి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం లభిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశేష విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. విద్యార్థులు విజయంతో సంతృప్తి చెందకుండా భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని మరింత కృషి చేయాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన, నియోజకవర్గ పరిశీలకులు వైరిచర్ల వీరేష్ దేవ్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పార్టీ నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## దేశ సేవే మహోన్నత సేవ



**పలాస, మే 26 (వార్త):** దేశ సేవే మహోన్నత సేవగా భావించే దేశ రక్షకుడు మంగళవారం గ్రామస్థాయి ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం లభించింది. వజ్రపుకొత్తూరు గ్రామానికి గర్వకారణమైన పోతనపల్లి పురుషోత్తం భారత దేశ రక్షణ కోసం ఎన్నో సంవత్సరాలు ఆర్మీలో సేవలందించి, ఇటీవల గౌరవప్రదంగా పదవీ విరమణ పొందిన సందర్భంగా మా ఫ్రెండ్స్ తరఫున హృదయపూర్వక సన్మానం నిర్వహించడం మా అదృష్టంగా భావిస్తున్నామని గ్రామ పెద్దలు తెలిపారు. దేశ సరిహద్దుల్లో కష్టనష్టాలను ఎదుర్కొంటూ దేశ భద్రత కోసం అంకితభావంతో సేవ చేసిన మీ సేవలు ప్రతి భారతీయుడికి మీరే ఆదర్శమని చెప్పారు. మీ త్యాగం, క్రమశిక్షణ, దేశభక్తి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా మా ఫ్రెండ్స్ తరఫున మీకు ఘన స్వాగతం పలుకుతూ, మీ సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు."దేశ సేవే మహోన్నత సేవ" అనే భావనను ఆచరణలో చూపించిన మీలాంటి జవాన్లకు మేము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పాతిన. శ్రీను, వంక మోహన్, కదంబాల. వెంకటరమణ, రాయల. శ్రీను తెలిపారు.

## భూ రీ సర్వేకు రైతులు సహకరించాలి



**నరసన్నపేట, మే 26 (వార్త):** గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని నరసన్నపేట తహశీల్దార్ సత్యనారాయణ కోరారు. మంగళవారం నరసన్నపేట మండలం సత్యవరం గ్రామంలో మండల సర్వేయర్ బృందంతో కలిసి ఆయన భూ రీ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, భూ హక్కుల పరిరక్షణతో పాటు భూ రికార్డులను పారదర్శకంగా రూపొందించేందుకు ప్రభుత్వం సమగ్ర భూ రీ సర్వే చేపట్టిందన్నారు. రైతులు అవసరమైన పత్రాలు అందించి అధికారులకు సహకరిస్తే సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. మండల సర్వేయర్ అప్పలస్వామి మాట్లాడుతూ, సత్యవరం గ్రామ పరిధిలో సుమారు 1,600 రైతు ఖాతాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి భూఖండాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను నవీకరిస్తున్నామని తెలిపారు. రైతుల సహకారం లభిస్తే నిర్ణీత గడువులోనే సర్వే పూర్తి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భూ సరిహద్దులు, యాజమాన్య వివరాల నమోదు వంటి అంశాల్లో రైతులు అధికారులతో సమన్వయం చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలను తగ్గించడంలో ఈ సర్వే కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కల్వర్టు నిర్మాణం చేపట్టాలి



**నరసన్నపేట, మే 26 (వార్త):** నరసన్నపేట మండలం రావులవలస పంచాయతీలో ఇటీవల సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన రహదారి పనులు పూర్తయినప్పటికీ, దానికి అనుసంధానంగా నిర్మించాల్సిన కల్వర్టు పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలోని నరసన్నపేట డంపింగ్ యార్డ్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మాణం అవసరమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మట్టి రహదారి మాత్రమే ఉండటంతో వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే రహదారి కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన రహదారి ద్వారా రాకపోకలు సులభతరమైనప్పటికీ, కల్వర్టు లేకపోవడం వల్ల వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ అవసరాలు, గ్రామీణ రవాణా మరియు డంపింగ్ యార్డ్‌కు వెళ్లే వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగే అవకాశం ఉందని అంటున్నారు. సంబంధిత అధికారులు పరిస్థితిని పరిశీలించి అత్యవసర ప్రాతిపదికన కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేస్తే భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చని అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేసి కల్వర్టు నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొనసాగుతున్న సమ్మర్ కోచింగ్

**-వాలీబాల్, షాట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థులకు శిక్షణ**

**- ఆసక్తిగా పాల్గొంటున్న విద్యార్థులు**

**నరసన్నపేట, మే 26 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇటీవల ఈ శిక్షణ తరగతులను జిల్లా క్రీడా అధికారి (డీఎస్ఓ) మహేశ్ ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతిరావు మాట్లాడుతూ, విద్యార్థులకు వాలీబాల్, షాట్‌పుట్ క్రీడల్లో నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అలాగే షటిల్ బ్యాడ్మింటన్‌లో కూడా ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నామని చెప్పారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరవుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వేసవి సెలవులను సార్థకం చేసుకునేలా క్రీడా శిక్షణ అందించడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దడమే ఈ శిక్షణ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్న విద్యార్థులు క్రీడల పట్ల మరింత ఆసక్తి పెరిగిందని, నైపుణ్యాలను మెరుగుపర్చుకునే అవకాశం లభిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మహానాడు ఏర్పాట్లు పరిశీలించిన బావన

**మందస, మే 26(వార్త):** తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరపబోయే మహానాడు-2026 ఉత్సవాల ఏర్పాట్లను మందస మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బావన దుర్యోధన మంగళవారం రాత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. మందస మండలాన్ని మూడు క్లస్టర్లకు గాను ఏర్పాటు చేసి, మూడు ప్రత్యేక వేదికల్లో జరుగుతున్న ఏర్పాట్లను స్వయంగా సందర్శించి, పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. పలాస నియోజకవర్గంలోని మందస మండలంలోని మందసటౌన్ పరిధిలో ఈనెల 27, 28 తేదీలలో మహానాడు జరగనుంది. ఈ సందర్భంగా దుర్యోధన క్లస్టర్ కమిటీలకు పలు కీలక సూచనలు చేశారు. కార్యకర్తల సౌకర్యాలు, మహానాడుకు తరలివచ్చే పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. వచ్చే విఐపిలు, అతిథుల నిర్వహణపై నాయకులతో సమగ్రంగా చర్చించి దిశానిర్దేశం చేశారు. పార్టీ ప్రతిష్టకు తగ్గట్టుగా ప్రతి ఏర్పాటూ అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి మహానాడును గ్రాండ్ సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పరిధిలోని పలువురు ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు కూడా పాల్గొన్నారు.



## కూచిపూడిలో ప్రతిభ చాటిన సాయిభువిక

**- నంది పురస్కారం అందుకున్న గొల్లలవలస విద్యార్థిని**



**పోలాకి, మే 26(వార్త):** గొల్లలవలస గ్రామానికి చెందిన యువ నర్తకి సాయిభువిక కూచిపూడి నృత్యంలో తన ప్రతిభను చాటుతూ ప్రతిష్మాత్మక నంది పురస్కారాన్ని అందుకుంది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన కూచిపూడి, ఆంధ్రనాట్యం ప్రదర్శనల సందర్భంగా ఆమెకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. కళారంగంలో చిన్న వయస్సులోనే విశేష ప్రతిభ కనబరుస్తున్న భువిక నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు న్యాయనిర్ణేతల ప్రశంసలను సైతం అందుకుంది. కూచిపూడి నృత్యంలోని భావవ్యక్తీకరణ, హావభావాలు, లయబద్ధమైన ప్రదర్శనతో ఆమె ప్రత్యేక గుర్తింపు పొందింది. భువికకు నృత్యంలో శిక్షణ అందిస్తున్న గురువు అజయ్ కుమార్, ఆమె తల్లిదండ్రులు కృష్ణకుమారి, శరత్ కుమార్‌లు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. కఠోర సాధన, కళాపట్ల అంకితభావమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. అరసవల్లి, కాశీ, విజయవాడ, తిరుపతి తదితర ప్రముఖ దేవాలయాల్లో సాయిభువిక అనేక నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సాయిభువిక సాధించిన ఈ ఘనతపై గ్రామస్తులు, కళాభిమానులు, స్నేహితులు ఆమెను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఒకే కుటుంబం ..ఒకే వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలి



**ఇచ్ఛాపురం మే 26(వార్త):** ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధి కౌన్సిల్ మందిరంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన మెప్మా పథక సంచాలకులు బి.శైలజ మెప్మా విభాగంతో సమావేశం నిర్వహించారు. ఒక కుటుంబం -ఒక వ్యాపార వేత్త లను తీర్చాదిద్దడం లో భాగంగా మార్గదర్శ కాలను, సూచలను తెలియజేస్తూ అర్హులు అందరికీ బ్యాంకు లింకేజీ, సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్ ఇప్పిస్తూ, లింకేజీ తీసుకున్నటువంటి సంఘ సభ్యులందరూ వ్యాపారాలు నిర్వహించేటట్లు, స్పెషల్ ప్రాజెక్ట్స్ (చాయ్ రాస్తా, మిల్లెట్స్ మార్ట్, మైక్రో కిరణా, బ్యూటీ పార్లర్, టైలరింగ్ మరియు ఎంబోరెడరీ)పైన అవగాహనా కల్పిస్తూ, కచ్చితంగా వ్యాపార వేత్తలుగా మార్చడంలో సిబ్బంది అర్ పిలు అందరూ నిబద్దత తో పనిచేసి ప్రగతి సాధించాలని తెలియజేసారు.ము న్సిపల్ కమీషనర్ రమేష్ మాట్లాడుతూ అర్హులు అందరికీ పి ఎం. స్వానిది లోన్స్ ఇప్పించాలని. ప్రతి అర్ పి హోమ్ కంపోస్టు కిట్ లను ఉపయోగిస్తూ ప్రజలకు హోమ్ కంపోస్ట్ పైన అవగాహనా కల్పించాలని అన్నారు. ప్రభుత్వం నుండి వచ్చిన ఐ వి అర్ ఎస్ కాల్స్ పైన సంఘ సభ్యులకు అవగాహనా కల్పించాలని తెలియజేసారు. కార్యక్రమంలో సాంకేతిక నిపుణులు రాము, శారదావాణి, కిషోర్, భాస్కరరావు, బాలరాజు, సంతోష్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## అల్లిమెరకలో ఘనంగా ముగిసిన ఉత్సవాలు



**మందస, మే 26(వార్త):** మందస మండలంలోని అల్లిమెరక గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత శ్రీచింతలపోలమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ నెల 24న ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ముగిసాయి. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. గ్రామ ప్రజలు మరియు కవిటి కాళికమ్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర భజన మండలి హరిపురం వారిచే భజన కార్యక్రమం, కవిటి కాళికమ్మ అధ్వర్యంలో గ్రామంలో అమ్మవారి వైభవ ఊరేగింపు మరియు కనువిందు చేసే వీధి నాటకాలు, తాడేపల్లి కళాకారులతో అద్భుతమైన అమ్మవారి వేషాలు, శ్రీకాకుళం కళాకారులతో మహిళల సంప్రదాయ కోలాటం, బొడ్డుపాడు వారితో అలరించే జానపదాలు, జాలారి నృత్య ప్రదర్శన, పవన్ ఐకాన్ డాన్స్ అకాడమీ హరిపురం వారిచే మెగా డాన్స్ ఈవెంట్, కవిటి కాళికమ్మ అధ్వర్యంలో గ్రామంలో ఘటాలతో అమ్మవారి ఊరేగింపు మహోత్సవం, తాడేపల్లి కళాకారులతో రోమాంచితమైన కాంతారా వేషాలు, గరుడభద్ర వారితో సినీ డాన్స్ ఈవెంట్ కనువిందు చేశాయి. అదేవిధంగా పవన్ ఐకాన్ డాన్స్ అకాడమీ హరిపురం వారితో మెగా డాన్స్ ఈవెంట్ ఆకట్టకున్నాయి. మూడు రోజుల పాటు శ్రీచింతలపోలమ్మ తల్లి అమ్మవారి సంబరాలను గ్రామస్తుల భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రామదేవత తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

## చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

**పలాస, మే 26 (వార్త):** పలాస జీడి పందు సెంటర్ వేదికగా నాటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీడి రైతాంగానికి ఎన్నికల సభ లో ఇచ్చిన హామీలు నెరవేర్చుతారని జీడి రైతులు ఎన్నో ఆశలతో గెలిపించారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు జీడి పంటల కాలం పూర్తి కావస్తున్న, ఆయన ఇచ్చిన హామీలు కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యాయని, జీడి రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ఇప్పటి వరకు ఎటువంటి చర్య చేపట్టలేదని ఆంధ్రప్రదేశ్ జీడి సంఘం అధ్యక్షులు తెప్పల అజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంతో గర్వంగా చెప్పుకుంటున్న వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ అన్న పథకంలో శ్రీకాకుళం జిల్లాను జీడిపంట పండించే జిల్లాగా గుర్తించినప్పటికీ, ఆ ఫలాలు జీడీ రైతులకు చేరలేదని, తాము ఆరుగాలం శ్రమించి పండించే పంట ఎంత ధరకు అమ్ముకోవాలో తెలియని దయనీయ గందరగోళ పరిస్థితిలో నేడు జీడి రైతాంగం కొట్టుమిట్టాడుతుందన్నారు. పలాస ఎమ్మెల్యే శిరీష అసెంబ్లీ వేదికగా జీడి రైతాంగం తరుపున చేసిన ఉపన్యాసాలు, ప్రస్తావనలు వృధా ప్రయాసగా కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జిల్లాకు చెందిన వ్యక్తి కింజరాపు అచ్చేన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో ఎందుకు చొరవ చూపడం లేదో అర్థం కాని పరిస్థితిలో ఉందని, ఇప్పటికైనా మంత్రి అచ్చేన్నాయుడు చొరవ తీసుకొని జీడి మార్కెటింగ్ విషయంలో మధ్యవర్తుల వ్యవస్థను నిర్మూలించి, రైతు సేవా కేంద్రాల ద్వారా జీడి రైతాంగం యొక్క జీడి పిక్కలను సేకరించి, ఆయా పరిశ్రమ దారులకు అనుసంధానం చేసినట్లయితే కనీసం ఎంతో కొంత రైతాంగానికి మేలు జరుగుతుందని ఆయన సూచించారు. ఇప్పటికైనా ఈ దశగా చర్యలు చేపట్టనట్లయితే, తాము రైతాంగాన్ని విస్తృతంగా ఐక్యపరిచి, ప్రత్యక్ష కార్యచరణతో మద్దతు ధర ఉద్యమానికి రైతాంగాన్ని సంసిద్ధం చేస్తామని ప్రభుత్వానికి ఆయన హెచ్చరించారు.

# దాసన్న పిలుపు... కేడర్‌కు మేల్కొలుపు

**-నరసన్నపేటలో వైసీపీ జోరు!**

**-74.54 శాతం వెరిఫికేషన్ తో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిన నియోజకవర్గం**

**- మండే ఎండల్లోనూ శ్రమించిన కార్యకర్తలు**

**-ఒక్కరోజే 1,556 మంది సభ్యుల వెరిఫికేషన్ పూర్తి**

**- ధర్మాన కృష్ణ చైతన్య ప్రశంసలు**

**(నరసన్నపేట)**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ, వార్డు, మండల కమిటీల సభ్యుల వెరిఫికేషన్ ప్రక్రియలో నరసన్నపేట నియోజకవర్గం



రాష్ట్రంలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. పార్టీ శ్రేణుల అకుంఠిత దీక్ష, కష్టపడే తత్వంతో నిన్న ఒక్కరోజే అత్యధికంగా 1,556 మంది సభ్యుల వెరిఫికేషన్‌ను పూర్తి చేసి, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనే అగ్రస్థానంలో నిలిచింది. దీంతో నియోజకవర్గంలో మొత్తం వెరిఫికేషన్ ప్రక్రియ 74.54 శాతానికి చేరుకుంది.

### నేతల ఆదేశం.. శ్రేణుల కదం..

శ్రీకాకుళం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పిలుపు మేరకు గత వారం రోజులుగా నియోజకవర్గంలో వెరిఫికేషన్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు నాయకులు, కార్యకర్తలు తమ సొంత పనులను సైతం పక్కనబెట్టారు. భానుడి భగభగలను, మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో ఎంతో ఉత్సాహంతో కదిలారు. జోన్-1 పరిధిలోని మిగిలిన నియోజకవర్గాల కంటే మిన్నగా నరసన్నపేటలో ఈ ప్రక్రియ ఊపందుకోవడం విశేషం.

### కృతజ్ఞతలు తెలిపిన కృష్ణచైతన్య

రాష్ట్రంలోనే మన నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపినందుకు పార్టీ యువనేత ధర్మాన కృష్ణ చైతన్య హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ అద్భుత విజయానికి కారకులైన పీఓసీ లకు, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులకు, కార్యవర్గ సభ్యులకు, ప్రతి ఒక్క కార్యకర్తకు నా సెల్యూట్. మీ బాధ్యతాయుతమైన కృషి వల్లే ఈ ఘనత సాధ్యమైంది" అని కొనియాడారు. ఇదే ఉత్సాహాన్ని ముమ్ముందు కూడా కొనసాగిస్తూ.. నియోజకవర్గంలో మిగిలివున్న కమిటీ సభ్యుల వెరిఫికేషన్ ప్రక్రియను కూడా వంద శాతం విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



# మహానాడును విజయవంతం చేయాలి

**టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి అర్చన**

**నరసన్నపేట, మే 26 (వార్త):** ఈ నెల 27, 28 తేదీల్లో వర్చువల్ విధానంలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ మహానాడును విజయవంతం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నరసన్నపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, మహానాడు పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమమని పేర్కొన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఈ ఏడాది మహానాడును వర్చువల్‌గా నిర్వహిస్తున్నందున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని పది క్లస్టర్లలో ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేసి మహానాడు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి మండల పరిధిలో పార్టీ శ్రేణులు సమిష్టిగా పాల్గొనేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. కార్పొరేషన్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, నీటి సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో



హాజరుకావాలని పిలుపునిచ్చారు. మహానాడు పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించే ముఖ్య వేదిక అని పేర్కొంటూ, నియోజకవర్గంలో పార్టీ ఐక్యత, బలాన్ని చాటేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తెలుగుదేశం కుటుంబ సభ్యులందరికీ మహానాడు ఒక మహా పండుగ అని, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ తమ వంతు పాత్ర పోషించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# సభ్యుల ఆర్థికాభివృద్ధే కో-ఆపరేటివ్ బ్యాంక్ లక్ష్యం



**పలాస, మే 26 (వార్త):** నూట పదకొండు ఏళ్లుగా అంచలంచెలుగా ఎదిగి నేడు రూ.8472.39 కోట్ల లావాదేవీలతో నడుస్తున్న ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ సభ్యుల ఆర్థిక అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుందని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఎంసి కళ్యాణ మండపంలో బ్యాంక్ డైరెక్టర్ కండాపు ప్రసాద రావు అధ్యక్షత పలాస బ్రాంచ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సామాన్యులకు, చిన్న చిన్న, వ్యాపారులకు తక్కువ వడ్డీ తో కూడిన రుణాలు ఇచ్చి వారి ఆర్థిక భరోసాకు పాటుపడుతుందన్నారు. దేశంలోని మొత్తం 1472 కోఆపరేటివ్ బ్యాంక్ లో 15వ స్థానంలో ఉందన్నారు. లాభా పేక్ష లేకుండా సామాన్యులకు బ్యాంకింగ్ మరింత దగ్గర చేయాలని ఉద్దేశంతో నిరంతరం మన బ్యాంకు పనిచేస్తుందన్నారు. 1,17,883 మంది సభ్యులతో 60 బ్రాంచ్ లలో సేవలు అందిస్తుందని, 2030నాటికి 100 బ్రాంచ్ ల లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.111 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ బ్యాంకు 1986 వరకు ఒకే బ్రాంచ్ ఉండేదని నేడు రెండు రాష్ట్రాల్లో విస్తరించి ఖాతాదారులకు సేవలు అందిస్తుందని తెలిపారు. సభ్యులు మరణిస్తే వారి కుటుంబాలకు ప్రమాద భీమా అందించడం తో పాటు, సభ్యుల పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ నగదు పురస్కారంతో పాటు, తక్కువ వడ్డీ కి విద్యా రుణాలు అందిస్తున్నామని తెలిపారు . ప్రతీ సభ్యుడికి జవాబు చెప్పేలా ప్రతీ ఏటా ఇలాంటి సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేసి బ్యాంక్ లావాదేవీలు మొత్తం ఒక పుస్తక రూపంలో ప్రతీ సభ్యుని ముందు ఉంచుతున్న ఒకే ఒక బ్యాంక్ ది విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ అని అన్నారు. బ్యాంక్ అభివృద్ధికి ప్రతీ సభ్యుడు కృషి చెయ్యాలని కోరారు. జోనల్ మేనేజర్ చామర్తి శ్రీనివాసరావు 25- 26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లావాదేవీలు, బ్యాంక్ పురోగతిని సభ్యులకు వివరించారు. ఇంచార్జ్ డైరెక్టర్ కండాపు ప్రసాదరావు మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద సహకార బ్యాంకుగా ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ నిలిచిందని, 1421 నాన్ షెడ్యూల్ బ్యాంక్ లలో ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. సహకార వ్యవస్థలో విసిబి బ్యాంక్ కు ప్రత్యేకమైన గుర్తింపు లభించిందని అన్నారు. బ్యాంకుకు ఖాతాదారులే పునాదులని వారిని ప్రోత్సహించడమే బ్యాంకు లక్ష్యమని అన్నారు.పలాస బ్రాంచ్ లో 21 కోట్ల రూపాయల రుణాలు ఖాతాదారు లకు అందజేశామని సక్రమంగా వాయిదాలు చెల్లించాలని కోరారు. ప్రస్తుతం 60 బ్యాంకులలో ది విసిబి బ్యాంక్ కార్యకలాపాలు నిర్వహిస్తుంటే మరో ఐదు బ్రాంచీలు నూజివీడు, తెనాలి, అమలాపురం, హయత్ నగర్, విశాఖలో మరో బ్రాంచ్ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులకు అనేక సంక్షేమ పథకాలను దేశంలో ఏ బ్యాంక్ అమలు చేయని విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సహకార వ్యవస్థలో తక్కువ వడ్డీ రుణాలతో సామాన్యులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. సహకారం అంటే సమిష్టిగా ఉండడమేనని, సభ్యుల సంక్షేమ పథకాల అమలు చేయడంలో బ్యాంకు ముందంజలో ఉందన్నారు. సహకార సంస్థల అభివృద్ధి చెందాలంటే అందరూ సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో పలాస బ్రాంచ్ మేనేజర్ నక్కా కనకమహాలక్ష్మి, బ్యాంకు సిబ్బంది రంజిత్, భరత్‌కుమార్, శివకృష్ణ, ఖాతాదారులు పాల్గొన్నారు.

# మహానాడు ఏర్పాట్లు పరిశీలించిన వజ్జ బాబురావు

**పలాస, మే 26 (వార్త):** విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఏపీటీపీసీ చైర్మన్ ఢ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబూరావు మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన సందర్భంగా లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, జి. సిగడాం మండలాల్లోని 10 క్లస్టర్ల పరిధిలో విస్తృతంగా పర్యటించి, మహానాడు విజయవంతం కోసం చేపడుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు భారీ ఎత్తున్న చేస్తున్నారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై సభా ప్రాంగణాలు, వసతి, భోజన ఏర్పాట్లు, రవాణా, పార్కింగ్, తాగునీరు, శానిటేషన్ తదితర అంశాలపై సవివరంగా చర్చించారు. మహానాడుకు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని సమన్వయంతో నిర్వహించాలని పార్టీ పరిశీలిస్తున్న వజ్జ బాబురావు సూచించారు. ముఖ్యంగా గ్రామ స్థాయి నుంచి పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేసి మహానాడును చారిత్రాత్మక విజయంగా నిలపాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల ఉత్సాహం, నాయకుల సమన్వయం చూస్తుంటే మహానాడు విజయవంతం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి సంకల్పం



ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే వేదికగా మహానాడు నిలవాలని పేర్కొన్నారు. పార్టీ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు, యువనాయకులు నారా లోకేష్ సమష్టి కృషితో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం ముఖ్య నేతలు కలిశెట్టి సూర్యనారాయణ, భువనేశ్వర్, గాలి రమణ రెడ్డి, తోటయ్య దొర , నారాయణ, శ్రీనివాస్, రాము నాయుడు, వంశీ, కృష్ణారావు,జగపతి బాబు, జక్కంపూడి దాసు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమరుల స్మారక సభను జయప్రదం చేయండి

**- కార్పొరేట్, హిందూ మతోన్మాధ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడదాం**

**- శ్రీకాకుళం అమరవీరులను స్మరించుకుందాం**

**- అమర వీరుల స్మారక కమిటీ పిలుపు**



**పలాస, మే 26 (వార్త):** బొడ్డపాడులో అమరుల స్మారక భవనం అవరణలో ఈ నెల 27న జరగనున్న అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయలని అమరవీరుల స్మారక కమిటీ పిలుపునిచ్చింది. చారిత్రాత్మ కంగా గత 37 సంవత్సరాలు నుంచి బొడ్డపాడు గ్రామ ప్రజల సమక్షంలో అన్ని విప్లవ పార్టీల అద్వర్యంలో సభలు నిర్వహిస్తున్నారు. మే 27 చారిత్రాత్మక రోజు అదేరోజు తొలి భూటకపు ఎన్ కౌంటర్లో ఏడు మంది అమరులైన రోజు కామ్రేడ్ పంచాది క్రిష్ణమూర్తి, బైనపల్లి పాపారావు, దున్న గోపాలరావు, మద్దిల నిరంజన్, తామడ చినబాబు, రామచంద్ర ప్రధానో, శ్రుంగవరపు నరిసింహులు అమరులైనారు. వారితో పాటు నేటి వరకు అమరులైన అమరవీరులను స్మరించుకుందాం. అందుచేత బుధవారం 27 వ తారీఖున జరుగుతున్న సభను విజయ వంతం చేయాలని ఉద్దాన ప్రాంతంలో ప్రజలు ప్రజాస్వామిక వాదులు, మేదావులు, మహిళా సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు ఈ సభలో పాల్గొని విజయ వంతం చేయాలి నిర్వాహణ కమిటీ పిలువు నిస్తుంది. ఈ కార్యక్రమం లో గ్రామ ప్రజలు దాసరి శ్రీరాములులతో పాటు నిర్వాహణ కమిటీ కన్వినర్ పోతనపల్లి కుసుమ, తామాడ త్రిలోచన, మద్దిల రామారావు,పోతనపల్లి నాగమణి,కుత్తుం దుష్యంత్, మద్దిల ధర్మారావు, జోగి కోదండరావు, గొరకల బాలక్రిష్ణ, కోనేరు రమేష్, వంకల మాదవరావు, జుత్తు వీరాస్వామి, పోతనపల్లి అప్పారావు, మురిపింటి గంగయ్య, బుడత బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి బలం

**కొత్తూరు, మే 26 (వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం కొత్తూరు మండల కేంద్రంలో పంచాయతీ కమిటీల వెరిఫికేషన్ ప్రక్రియను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రతి పంచాయతీ కమిటీ పనితీరును, కమిటీ సభ్యుల వివరాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి రెడ్డి శాంతి మాట్లాడుతూ... పార్టీకి అసలైన బలం కార్యకర్తలేనని, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో మెలుగుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజాపక్షాన నిలబడాలి అని ఆమె సూచించారు. వైఎస్సార్‌సీపీ నిరంతరం ప్రజల సంక్షేమం కోసమే పాటుపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రమ్మ, జెడ్పీటీసీ కామక భాగ్యవతి, మండల పార్టీ అధ్యక్షులు గండివలస ఆనందరావు, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి చింతాడ సూర్యనారాయణ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు అగతముడి నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గడబండి పోలయ్య,మాజీ సర్పంచ్‌లు షిఫాన్, అశోక్, బాలకృష్ణ, ఎంపీపీ ప్రతినిధి సవర రమేష్, అగతముడి రంజిత్, ఎంపీటీసీలు గండివలస రత్నకుమారి, వనము లక్ష్మీనారాయణ, దూలి అప్పన్న, మాజీ సర్పంచ్ ప్రతినిధి వైకుంఠరావు, వంగరవెల్లి సూర్యనారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL/2023/87546